క్లుప్తంగా

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



హుజూరాబాద్‌లో నాయకుల సంబురాలు

హుజూరాబాద్‌రూరల్: బీఆర్ఎస్ ప్రజల తరఫున విద్యుత్ చార్జీలు పెంచకుండా ప్రభుత్వాన్ని నిలువరించినందుకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ ఎడవల్లి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరిట రూ.18,500 కోట్ల భారాన్ని ప్రజలపై మోపాలనుకుందని, బీఆర్ఎస్ పోరాటంతోనే ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, అపరాధ ముత్యం రాజు, ముక్క రమేష్, కేసిరెడ్డి లావణ్య, సుశీల, నాయకులు ఇమ్రాన్, మైకిల్ పాల్గొన్నారు.

చొప్పదండి: కాంగ్రెస్ ప్రభుత్వం రూ.వేల కోట్ల విద్యుత్ చార్జీలను ప్రజలపై వేయాలనుకుందని, బీఆర్ఎస్ పోరాటంతోనే ప్రభుత్వం తలొగ్గిందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచలేదని, ప్రస్తుతం పెంపునకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోటాటం చేసిందని, ప్రజలపై అడ్డగోలు విద్యుత్ చార్జీలు పెంచాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను ప్రధాన ప్రతిపక్షం విఫలం చేసి విజయం సాధించిందన్నారు. ప్రజల పక్షాన నిలిచిన ఈఆర్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

జమ్మికుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మల్యారి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో పార్టీ మూడో మండల మహాసభ నిర్వహించారు. మోత్కులగూడెం చౌరస్తా నుంచి గాంధీ చౌక్ మీదుగా వర్తక సంఘం భవనం వరకు ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తూ దేశభక్తి పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పుతుందని ఆరోపించారు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన ఒకే దేశం ఒకే ఎన్నికను పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, పార్లమెంట్, శాసనసభ, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలతో పార్లమెంటరీ ప్రజాస్వామ్య, సమైఖ్య వ్యవస్థకు విఘాతం కలుగుతుందన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్టేనని, రాష్ట్రాలు జమిలీ ఎన్నికలను తిరస్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, జోన్ కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, ఇల్లందకుంట ప్రజాసంఘాల కన్వీనర్ చెల్పూరి రాములు, నాయకులు రమేశ్‌యాదవ్, ఓదెలు, సమ్మయ్య, శోభన్, కిషోర్, కుమార్, రామస్వామి, క్రాంతి, ఖలీల్ పాషా, ప్రసాద్, పోచయ్య, కిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న మాడుగుల ఓదెలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాడుగుల ఓదెలు మంగళవారం అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ అవార్డు ప్రదానం చేసింది.

11 కేజీల గంట బహూకరణ



గంట అందజేస్తున్న ఎల్లయ్య, ఎల్లమ్మ

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు రేణుక ఎల్లమ్మ ఆలయానికి 11 కేజీల గంటను గ్రామానికే చెందిన రామగిరి ఎల్లయ్య, ఎల్లమ్మ అందించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు తీగల సంపత్, శ్రీనివాస్, సదానందం, నరేశ్, లింగయ్య, నర్సయ్య, రవీందర్, రంజిత్ అశోక్ పాల్గొన్నారు.

ధాన్యం కొంటలేరు..!

- పట్టణం, మండలంలో ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- పదిహేను రోజులుగా రైతుల పడిగాపులు
- మిల్లుల కేటాయింపులో అలసత్వం
- ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న వైనం
- కొనుగోళ్లకు చర్యలు చేపట్టాలని కోరుతున్న రైతులు



'పక్క చిత్రంలోని వ్యక్తి పేరు ఎగిత కొంరయ్య మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామం. రెండెకరాల్లో వరి సాగు చేశాడు. సుమారు 45 క్వింటాళ్ల ధాన్యం పండింది. 15 రోజుల క్రితం పీఏసీఎస్ పరిధిలోని కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చాడు. తేమ లేకుండా ధాన్యం ఆరబెడుతున్నాడు. 13 రోజులుగా ఇక్కడికే అన్నం తెప్పించుకుంటూ కొనుగోళ్ల కోసం పడిగాపులు కాస్తున్నా ఇప్పటివరకు గింజ కొంటలేరు. ఇది కొంరయ్య ఒక్కడి పరిస్థితి కాదు. రైతులందరిదీ ఇదే పరిస్థితి. త్వరగా కొనుగోళ్లు చేపట్టేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాత మార్కెట్ యార్డు కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెడుతున్న రైతు

జమ్మికుంట: వానాకాలం వరికోతలు పదిహేను రోజుల క్రితమే ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేస్తోంది. దీంతో కేంద్రాల్లో ధాన్యం పోసి పడిగాపులు కాస్తున్నారు. ఆరుగాలం కష్ట పడి పండించిన ధాన్యం అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణంలో మార్పులు వల్ల ముందుస్తు కోతలు చేపడితే కొనుగోళ్లకు ఎదురుచూపు తప్పడం లేదు. జమ్మికుంట వ్యవసాయ పాత మార్కెట్‌లో కొనుగోళ్లకు అధికారులు అన్నీ సిద్ధం చేసినప్పటికీ మిల్లుల కేటాయింపులో జాప్యం వల్ల రైతులు కేంద్రం వద్ద నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం ఆదేశాలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ఏ గ్రేడ్‌కు రూ.2,320, బీ గ్రేడ్‌కు రూ. 2,183 , సన్నాలకు రూ. 500 బోనస్‌తో కొనుగోలు చేస్తామని తెలిపింది.

ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకపోవడం, కొనుగోళ్లలో జాప్యంతో పడిగాపులు కాయలేక కొందరు రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. క్వింటాల్‌కు రూ.400 వరకు తక్కువకు అమ్ముకుంటున్నారు. సన్నాలను ఇతర రాష్ట్రాలకు ప్రైవేటు వ్యాపారుల ద్వారా అమ్మకం చేస్తున్నారు. తక్కువ ధరకు అమ్ముకొని ఎకరా ధాన్యానికి సూమారు రూ.7,500 వరకు నష్టపోతున్నారు.

ఏర్పాటు చేయాల్సిన కొనుగోలు కేంద్రాలు

జమ్మికుంట పాత మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో-1, జమ్మికుంట మండలంలోని ఇల్లందకుంట పీఏసీఎస్ పరిధిలో 6, ధర్మారం పీఏసీఎస్ పరిధిలో 2, తనుగుల పీఏసీఎస్ పరిధిలో 3 కొనుగోలు కేంద్రాలు గత సీజన్‌లో ప్రారంభించారు. కానీ కోతలు మొదలై, ధాన్యం కేంద్రాలకు తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు చేయడం లేదు.

మిల్లులు కేటాయించలేదు



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపింది. గతంలో మిల్లుల కేటాయింపు సీజన్‌కు ఇరవై రోజుల ముందే జరిగింది. రైతుల ఇబ్బందులను పట్టించుకోవాలి. సంబంధిత అధికారుల నుంచి సానుకూల సమాధానం రావడం లేదు. రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి, మద్దతు ధర పొందలేక పోతున్నారు. మిల్లుల కేటాయింపు జరగకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది.

– పొనగంటి సంపత్, పీఏసీఎస్ చైర్మన్, జమ్మికుంట



చిన్నముల్కనూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పిల్లలూ.. షూ ఎట్లున్నయ్

చిగురుమామిడి: 'పిల్లలూ.. ఎట్లున్నరు.. మొన్న ఇచ్చిన షూఎట్లున్నయ్. రోజూ స్కూల్‌కు వేసుకెళ్తున్నారా.? హెయిర్ స్టైల్ ఎంటీ ఇలా ఉంది..? బస్సులు ఎలా నడుస్తున్నాయంటూ.. మంత్రి పొన్నం విద్యార్థులతో ముచ్చటించారు. మంగళవారం సాయంత్రం హుస్నాబాద్ పర్యటన ముగించుకుని కరీంనగర్ వెళ్తున్న మంత్రి చిన్నముల్కనూర్ చౌరస్తాలో గుంపులుగా ఉన్న ఆదర్శపాఠశాల విద్యార్థులను చూసి కాన్వాయ్ ఆపి కాసేపు ముచ్చటించారు. ఇటీవల పంపిణీ చేసిన షూలను గురించి ఆరా తీశారు. బస్సులు సరిపడా నడుస్తున్నాయా అని ప్రశ్నించారు. సాయంత్రం వేళ బస్సులు నిండుగా వస్తున్నాయని, డ్రైవర్లు ఆపడం లేదని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాము ఇంటికి చేరుకునే సరికి రాత్రి అవుతోందని చెప్పడంతో బస్సుల ట్రిప్పులు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి విద్యార్థులకు హామీ ఇచ్చారు.

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

హుజూరాబాద్‌రూరల్: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. 16 అంశాలను ప్రస్తావించగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం రూ.7.16 లక్షలతో సెంట్రల్ లైటింగ్ మరమ్మతులు, రూ.పదిలక్షలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నుంచి డీసీఎంఎస్ కాంప్లెక్స్ వరకు మురుగు కాలువ నిర్మాణం, నీటి సరఫరాకు చెడిపోయిన మోటార్లను రిపేరుకు రూ.47,200,రూ.75, 953లతో బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు ఆమోదం లభించింది.



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

బోర్నపల్లి వాసుల నిరసన..

సమావేశం జరుగుతున్న వేళ 24వ వార్డు పరిధిలోని బోర్నపల్లి వాసులు నిరసన వ్యక్తం చేశారు. బోర్నపల్లికి వెళ్లే కాకతీయ కెనాల్ నుంచి బోర్నపల్లి శివారు వరకు ఆర్అండ్‌బీ రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ పోల్స్, ఎయిర్ , గేటువాల్వ్‌స్ సెట్ బ్యాక్ చేయాలని కోరారు. రోడ్డు వెంట ఉన్న ముళ్ల పొదలను తొలగించాలన్నారు. ఈవిషయంపై మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక స్పందించి వెంటనే చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. అలాగే విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత ఉద్యోగులను కలెక్టర్‌కు సరెండర్ చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ ఎస్. సమ్మయ్య, ఇన్‌చార్జి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ జి.సాంబరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అశ్వినీగాంధీ, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏం.కిషన్‌రావు, వార్డు సభ్యులు, సీనియర్ సహాయకులు ఎండీ.రశీద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అనుమతి లేకుండా నిర్మిస్తున్న క్రషర్



ముళ్లపొదల్లో విద్యుత్ స్టార్టర్ డబ్బా

అక్రమంగా విద్యుత్ వినియోగం

శంకరపట్నం: క్రషర్ నిర్మాణానికి అక్రమంగా వినియోగిస్తున్న విద్యుత్ కనెక్షన్‌ను మంగళవారం ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించారు. మండలంలోని కాచాపూర్ శివారు చీపురుగుట్టలో వీణవంక మండలానికి చెందిన ఓ వ్యక్తి క్రషర్ నిర్మిస్తుండగా రైతులు అభ్యంతరం తెలిపారు. అనుమతులివ్వొద్దని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గతంలో అధికారులు విచారణ చేసి పనులు నిలిపేరు. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా వ్యవసాయబావుల నుంచి విద్యుత్‌ను క్రషర్ కోసం వినియోగిస్తుండగా గమనించిన రైతులు మంగళవారం ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించారు. వెల్డింగ్ పనులకు విద్యుత్ ఉపయోగిస్తున్నట్టు గుర్తించామని క్రషర్ యజమానిపై విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ రఘు తెలిపారు. కాగా చీపురుగుట్టలో గుడుంబా తయారీకి సంబంధించి నల్లబెల్లం పానకం, సామగ్రి ఉండటంతో ఎక్సైజ్ అధికారుల కళ్లు గప్పి గుడుంబాతయారీ చేస్తున్న వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

ఆర్ఎస్ఎస్ పద సంచలన్

రామడుగు: మండల కేంద్రంలో ప్రధాన వీధుల్లో మంగళవారం సాయంత్రం ఆర్ఎస్ఎస్ పద సంచలన్, జిల్లా పరిషత్తు పాఠశాల ఆవరణలో ధ్వజారోహణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జూడో పోటీల్లో బంగారు పతకం



సహస్రను సత్కరిస్తున్న గ్రామస్తులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన గాజుల సహస్ర జూడో పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు గ్రామస్తులు తెలిపారు. గాజుల కుమార్-పద్మ కూతురు సహస్ర ఆదిలాబాద్ జిల్లాలోని స్పోర్ట్స్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. వరంగల్‌లో మంగళవారం నిర్వహించిన జూడో పోటీల్లో సహస్ర ప్రతిభ కనబరిచింది. ఇప్పటి వరకు నాలుగు బంగారు పతకాలు సాధించిన విద్యార్థినిని గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో చైర్మన్ నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ స్కూల్ విద్యార్థులు మణికంఠ, అశ్విత్, జయశ్రీ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్, ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో అండర్-14, 17 పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను మంగళవారం అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు.

నవంబర్ 2న ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో నవంబర్ 2న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ, హాకీ పోటీలు నిర్వహించనున్నామని ఎంఈవో శ్రీనివాస్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సొల్లు సారయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 కబడ్డీ, హాకీ పోటీలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత పత్రాలతో హైస్కూల్ క్రీడా మైదానానికి రావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మానకొండూర్: మండలంలో మంగళవారం రాత్రి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేశామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ధన్వంతరి జయంతి



సూచనలు ఇస్తున్న డాక్టర్ సనా

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలో శ్రీరామ నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధన్వంతరి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఆయుర్వేద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సనా ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. ఆయుర్వేదంలో అన్నిరకాల వ్యాధులకు మందులు ఉన్నాయని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, టీచర్ విజయ, ఆశాకార్యకర్తలు, బాలింతలు తల్లులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని మామిండ్ల వాడలో నివాస గృహాల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగునీటి నిల్వతో దుర్వాసన వెలువడుతుందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దోమలు వృద్ధి చెంది రోగాలబారిన పడతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సమ్మయ్య, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్, సెల్ నంబర్ : 70326 51516

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9393557752

సంక్షిప్త వార్తలు

● పోలీస్ స్టేషన్ సందర్శన

సైదాపూర్: సైదాపూర్ పోలీస్ స్టేషన్‌ను కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి మంగళవారం తనిఖీ చేశారు. కేసుల పురోగతి, కార్యాలయ రికార్డులు పరిశీలించారు. మండలంలోని సమస్యలు, నేర వివరాలు ఎస్ఐ తిరుపతిని అడిగి తెలుసుకున్నారు.

● కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీనివాస ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు ముప్పై ఐదేళ్ల క్రితం జమ్మికుంట గ్రామ పంచాయతీ తీర్మానం చేసి లీజుకు ఇచ్చింది. నిర్వాహకుడి మృతితో స్కూల్ మూతపడింది. స్కూల్ స్థలాన్ని కొందరు ఎలాంటి అనుమతి లేకుండా అమ్మడం, కొనుగోలు చేయడం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త గుర్రపు మహేంద్రనాథ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ అక్బర్ పాషా సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని,స్థలాన్ని మున్సిపల్‌కు కేటాయిస్తే ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

● చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

జమ్మికుంట: పట్టణంలో నిబంధనలు పాటించకుండా టపాసుల దుకాణాల ఏర్పాటు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని జమ్మికుంటకు సామాజిక కార్యకర్త గుర్రపు మహేంద్రనాథ్ మంగళవారం తహసీల్దార్ రమేశ్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో తడకలతో దుకాణాలు ఏర్పాటు చేశారని, లైసెన్స్ లేకుండా ఇప్పటికే కంపెనీ వివరాలు లేని టపాసులు ఇళ్లలో భారీ ఎత్తున నిల్వ చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును ఆర్డీవో హుజూరాబాద్, మున్సిపల్ కమిషనర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, ఫైర్ సేఫ్టీ అధికారులకు అందించామన్నారు.

● విత్తన శుద్ధితో అధిక లాభాలు

గన్నేరువరం(మానకొండూర్): విత్తన శుద్ధితో రైతులు అధిక లాభాలు పొందవచ్చని సీనియర్ సైంటిస్ట్ విజయభాస్కర్, అగ్రోనామిస్ట్ సైంటిస్ట్ మధుకర్ రావు అన్నారు. మండలంలోని ఖాసీంపేట రైతువేదికలో అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ మొక్కజొన్న విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించింది. రైతులు పంటలు సాగు చేసే ముందు విత్తన శుద్ధి చేసుకొని పంటలు సాగు చేయాలని సూచించారు. అలాగే కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఎరువుల యాజమాన్యం నీటి పారకం గూర్చి వివరించారు. వ్యవసాయ అధికారి పద్మ, కిరణ్మయి, ఏఈవో అనూష ,పిఏసిఏస్ డైరెక్టర్ గంప వెంకన్న, మాజీ ఉపసర్పంచ్ బద్దం సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

● నేడు సివిల్ రైట్స్ డే

శంకరపట్నం: మండలంలోని మక్త గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించనున్నామని తహసీల్దార్ భాస్కర్ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు, గ్రామ ప్రజలు హాజరు కావాలని కోరారు.

● కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సైదాపూర్: మండలంలోని వెన్కెపల్లి విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. సంఘం పరిధిలోని రైతుల సౌకర్యం కోసం కేంద్రాలను ప్రారంభించినట్లు తిరుపతిరెడ్డి తెలిపారు. నాణ్యమైన కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, రాఘవులు, చాడ కొండాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ వీరేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య మాజీ సర్పంచులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

● అభినందనలు

మానకొండూర్(గన్నేరువరం): గన్నేరువరంకు చెందిన ఇక్కుర్తి రాజు 2020లో మొదటి ప్రయత్నంలోనే పోలీస్ ఉద్యోగం సాధించాడు. విధులు నిర్వహిస్తూనే లెక్చరర్ ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదివాడు. ఇటీవల విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో కెమిస్ట్రీ లెక్చలర్‌గా ఉద్యోగం సాధించగా రాజును పలువురు అభినందించారు.



మాట్లాడుతున్న రవీందర్, తదితరులు

పరిహారం ఇప్పించడంలో సతీశ్‌కుమార్ విఫలం

చిగురుమామిడి: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎక్కడైనా తిరగొచ్చు అనే విషయాన్ని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ తెలుసుకోకపోవడం బాధాకరమని, మంత్రిపై మాట్లాడిన తీరును కాంగ్రెస్ ఖండిస్తుందని మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. మంగళవారం చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ వరంగల్‌కు వస్తే మీ ఇంటికే వచ్చేవారు అయినప్పటికీ హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి పనులను ఎందుకు పూర్తిచేయలేకపోయారని ప్రశ్నించారు. గౌరవెల్లి భూనిర్వాసితులకు రావాల్సిన పరిహారం ఇప్పించడంలో విఫలమయ్యారని, పదేళ్లలో ప్రాజెక్టు పూర్తిచేయలేక చౌకబారు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయకులు పూల లచ్చిరెడ్డి, పొన్నం సంపత్, వంగ కనుకయ్య, తాల్లపల్లి తిరుపతి, దొబ్బల బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మణ్, కోటి తదితరులు

'ఎమ్మెల్యే కవ్వంపల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయొద్దు'

తిమ్మాపూర్: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని డీసీసీ కార్యదర్శి సముద్రాల లక్ష్మణ్, కేడీసీసీబీ డైరెక్టర్ అలువాల కోటి మండిపడ్డారు. మండలంలోని మహాత్మానగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడరు. దళితులను మాజీ ఎమ్మెల్యే రసమయి ఏనాడూ పట్టించుకోలేదని, స్వార్థ ప్రయోజనాల కోసం దళితులపై దాడులు, అక్రమంగా కేసులు నమోదు చేయించారని, ఇతర సామాజికవర్గానికి చెందిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. అక్రమ ఆస్తుల చిట్టా విప్పుతామని, ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో పసుల వెంకటి, రెడ్డిగాని రాజు, కనుకం అశోక్, మచ్చ రాజేశం, కొంకటి రాములు, నాయకులు సంపత్, జీడీ శ్యామ్, కోండ్ర సురేశ్, అలువాల కుమార్, శంకర్, మాతంగి సతీశ్, ఎస్.అనిల్, మానాల రవి, ఎస్.శ్రీనివాస్, జె.మధు, శ్రీనివాస్, ఎల్.శ్రీనివాస్, కె.రాములు, ఎం ప్రభాకర్, రాసూరి మల్లికార్జున్, సిరిసిల్ల రాజు నరేశ్ పాల్గొన్నారు.